నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | జులై 07, 2024 | www.navatelangana.com

షార్ట్ సర్క్యూట్‌తో ఏటీఎంలో మంటలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏటీఎంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మావల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని రిమ్స్ సమీపంలోని ఎస్బీఐ ఏటీఎంలో అర్ధరాత్రి ఒకటి గంట సమయంలో షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకుంది. దీంతో ఏటీఎం మిషన్ పక్కన గదిలో బ్యాటరీలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను సకాలంలో ఆర్పేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. నగదుకు ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

సమాజంలో ఉన్న వారందరికీ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని లక్కంపూర్ ఆశ్రమ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు ప్రాముఖ్యత, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్‌రావు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

సారంగాపూర్ : పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని తెలిపారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టును సందర్శించి వాహనాల రాకపోకల వివరాల నమోదు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ మార్గంలో వచ్చే ప్రతి వాహనంపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి వృద్ధుడి ఆత్మహత్య

బోథ్ : మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన సంపెంగల భోజన్న(71) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య తెలిపిన వివరాల ప్రకారం..భోజన్న కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



ఖనాపూర్‌టౌన్ : మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం కలిసి సీడీఎంఏ కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్, ఈఎన్సీ జియాఉద్దీన్‌లను కలిశారు. పట్టణ వార్డుల్లో నూతన డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికను అందజేశారు. వీరి వెంట వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు పరిమి సురేష్, షబ్బీర్ పాషా ఉన్నారు.

డయాలసిస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఆదిలాబాద్‌టౌన్ : డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్ సూచించారు. రిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రంలో ఇది వరకే 10 యంత్రాల ద్వారా రక్తశుద్ధి చేస్తుండగా తాజాగా మరో యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త యంత్రాన్ని రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్ శనివారం ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా ప్రతిరోజు మరో ఐదుగురికి డయాలసిస్ చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు అశోక్, ఆర్ఎం చందు, డయాలసిస్ ఇన్‌చార్జి ప్రేమ్‌దాస్, వైద్యాధికారి తానాజీ పాల్గొన్నారు.

కొలాంగూడ, అంకాపూర్‌లో వైద్య శిబిరాలు

ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో గల కొలాంగూడ, అంకాపూర్ గ్రామాలలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించినట్టు డా.సర్ఫరాజ్ తెలిపారు. కొలాంగూడలో 22 మంది కొలాం ఆదిమ గిరిజనులకు మందులు పంపిణీ చేశారు. అంకాపూర్‌లో 37 మందికి చిరు వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ మర్సకోల లక్ష్మీబాయి, బొమ్మెత సుభాష్, హెల్త్ అసిస్టెంట్స్ నల్ల ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరిదేవి, వేణుతాయి, కౌసల్య, అంగన్వాడీ టీచర్ శోభాబాయి, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సైగా సతీష్ బాధ్యతల స్వీకరణ



లక్షెటిపేట : నూతన ఎస్సైగా పోచంపల్లి సతీష్ శనివారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన చంద్రకుమార్ రామగుండం వీఆర్‌కు బదిలీ కావడంతో అతని స్థానంలో నూతన ఎస్సైగా సతీష్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న చంద్రకుమార్‌ను సిఐ నరేందర్‌తో పాటు సిబ్బంది శాలువాతో సన్మానించారు.

పరిహారం చెక్కుల పంపిణీ



కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో శనివారం ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగులకు పరిహార చెక్కులను అందించారు. కాసిపేట్-2 గని ఉద్యోగులు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్, జనరల్ మజ్దూర్ కర్రే రాజు కుటుంబీలకు రావలసిన టెర్మినల్ బెనిఫిట్స్, సోషల్ సెక్యూరిటీ ఫండ్, మ్యాచింగ్ గ్రాంట్ చెక్కులను రమేష్ భార్య మచ్చ రోజాకు రూ.20,63,918, కర్రె రాజు భార్య కర్రె జ్యోతికి రూ.21,80,494 చెక్కులను గని మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, ఏఐటియూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, సంక్షేమాధికారి భార్గవ్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ఉద్యోగాలు

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయంలో సంగీతం/నృత్యానికి కోచ్, టీజీటీ సంస్కృతం, మ్యాథమెటిక్స్, సోషల్ సైన్స్ నాలుగు పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న ఉదయం నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్, ఒక సెట్ జిరాక్స్ సెట్‌తో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9730617998 నెంబరును సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినికి ఘన సన్మానం

కాసిపేట : మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి విద్యార్థిని ప్రీతికుమారిని ఘనంగా సన్మానించారు. ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించిన భూమి పునరుద్ధరణ ఎడారీకరణ కరువు స్థితి స్థాపకత అనే అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలలో జిల్లాలో మొదటి స్థానం సాధించినందుకు విద్యార్థినిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం..వ్యాపారం..!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేట్ ఆస్పత్రులు
- అర్హత లేని ఒప్పంద వైద్యులతో రోగులకు చికిత్సలు
- అనవసరంగా వైద్య పరీక్షలతో రోగుల జేబులకు చిల్లులు
- అనుమతులు ఉండవు...అధికారులు పట్టించుకోరు..

జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారింది. రోజురోజుకూ పుట్టగొడుగుల్లా ప్రయివేటు ఆసుపత్రులు అనుమతులు లేకుండా వెలుస్తున్నాయి. అర్హతలేని ఒప్పంద ప్రాతిపదికన ఇతర ప్రాంతాల నుండి వైద్యులను తీసుకొచ్చి రోగులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా అనవసరంగా వైద్య పరీక్షలు చేయిస్తూ అవసరానికి మించి మందులు రాస్తూ రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. బహిరంగంగా ఈ తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు.





లోకేశ్వరం మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడు సైనస్ వ్యాధితో బాధపడుతూ జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రయివేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చాడు. కొన్ని రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స చేసి వ్యాధి తీవ్రత పెరిగిందని హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లో అక్కడికి వెళ్లారు. అక్కడ అనేక రకాల వైద్య పరీక్షలు చేశారు. ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, అందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు. లేనిపక్షంలో వ్యాధి ముదిరి ప్రాణాలకు ప్రమాదమని భయాందోళనకు గురి చేశారు. చేసేది లేక ఆ మధ్యతరగతి కుటుంబం అప్పులు చేసి ఆపరేషన్‌కు ఒప్పుకున్నారు. ఆపరేషన్ అనంతరం వారానికి ఒకసారి వచ్చి పరీక్షలు చేసుకోవాలని చెప్పి లక్షలు దండుకున్నారు.

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ లాంటి పేర్లతో రోగులను ఆకర్షించే విధంగా ఆసుపత్రులు వెలుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో రెండు సంవత్సరాల వ్యవధిలో పదుల సంఖ్యలో ఇటువంటి ఆస్పత్రులు వెలిశాయంటే ఈ వ్యాపారం ఎంతగా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. లాభార్జనే ధ్యేయంగా వైద్యాన్ని వ్యాపారం చేసుకోవడం కోసం కొందరు రాజకీయ నాయకులు, బడా వ్యాపారస్తులు ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు.

అర్హతలేని ఒప్పంద వైద్యులతో రోగులకు చికిత్సలు

ఆసుపత్రులలో అర్హత లేని ఒప్పంద ప్రాతిపదికన ఇతర ప్రాంతాల నుండి వైద్యులను తీసుకొచ్చి రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో నెల లేదా మూడు నెలలకు ఒక వైద్యుడు మారుతున్నాడంటే విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎంతో నమ్మకంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు ఇలా వైద్యులు మారుతుండడంతో విస్తూ పోతున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వైద్యం చేయించుకుంటున్నారు.

అనవసరంగా వైద్య పరీక్షలు

ఆస్పత్రుల్లో రోగులను ఆకర్షించే విధంగా దీర్ఘకాలిక వ్యాధులైన కిడ్నీ, గుండె, థైరాయిడ్, నరాల బలహీనత ఇలా పలు రకాల వ్యాధులకు స్పెషలిస్టు వైద్యులను ఇతర పాత్రల నుండి తీసుకొస్తున్నారు. నెలలో మొదటి, రెండవ, మూడవ, నాలుగవ వారం అంటూ ప్రత్యేక చికిత్స ఉంటుందని తేదీని ప్రకటిస్తూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. వీటికి ఆకర్షితులైన రోగులు తమ వ్యాధి నయమవుతుందని నమ్మకంతో ఈ ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని అనవసరంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అధిక మొత్తంలో మందులు ఇస్తూ దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగుల పరిస్థితి విషమిస్తే హైదరాబాద్, నిజామాబాద్ నగరాలకు తమకు సంబంధం ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో రోగులు అక్కడి ఆసుపత్రులకు వెళ్తే చికిత్సల పేరుతో లక్షల్లో బిల్లులు వేస్తున్నారు. ఆ ఆసుపత్రులతో ముందస్తు ఒప్పందం ప్రకారం కమీషన్లు మాట్లాడుకుంటు డబ్బులు దండుకుంటున్నారు.

అనుమతులుండవు..అధికారులు పట్టించుకోరు..

ఆసుపత్రుల తతంగమంతా బహిరంగంగా జరుగుతున్నా వైద్య, ఆరోగ్య శాఖ, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీల చేస్తున్నారు. దీనికి రాజకీయ ఒత్తిళ్లు, మామూళ్లు అందుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి జిల్లాలో వైద్యం అనేది వ్యాపారంగా మారిందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతి లేని ఆసుపత్రులు, అర్హత లేని వైద్యులను గుర్తించి చర్యలు తీసుకుంటే రోగులకు న్యాయం జరుగుతుందని పలువురు జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రయివేట్ ఆస్పత్రులపై బృందాల వారీగా తనిఖీలు : డాక్టర్ ధన్‌రాజ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ

ప్రయివేట్ ఆస్పతులపై ఎప్పటికప్పుడు బృందాల వారీగా ఆకస్మిక తనిఖీలు చేస్తూ పర్యవేక్షిస్తున్నాం. అనుమతి, అర్హత లేని వైద్యులు ఉంటే తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటివి దృష్టికి వస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకు రావాలి. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రులను నోటీసులు జారీ చేసి మూసివేస్తాం.

సహకార సంఘాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సహకార సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సహకార సంఘం అధ్యక్షులు మేకల వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆవరణలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులు నష్టపోకుండా అధిక ధరలకు ఎరువులు కొనవద్దని, సంఘం ఆధ్వర్యంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సహకార సంఘంలో మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు చట్ల వినీల్, జి.రాజేంద్రప్రసాద్, ఎం.సత్యనారాయణ, జె.దేవ్‌రావు, ఎన్.లింగన్న, కార్యదర్శి నారాయణగౌడ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలో సహకార సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో జెండాను పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ ఎగురవేశారు. కార్యక్రమంలో సహకార సంఘ కార్యవర్గ సభ్యులు గొర్ల రాజు యాదవ్, లోలపు పోశెట్టి, జిట్ట శ్రీనివాస్, కార్యదర్శి గోలి స్వామి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నేరడిగొండ : మండలంలోని కుమారి గ్రామంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం పిఎసిఎస్ చైర్మన్ మందుల రమేష్ సప్త రంగుల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజారాం, సీఓ ప్రవీణ్, రైతులు అగ్గు రమేష్, బి.రమణారెడ్డి, రవి, మల్లేష్, నవీన్ పాల్గొన్నారు.





ప్రారంభమైన ఎప్‌సెట్ కౌన్సెలింగ్



ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణలో ప్రభుత్వ, ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్‌లో ప్రవేశించేందుకు ఎప్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ప్రక్రియను కోఆర్డినేటర్ వీరస్వామి ప్రారంభించి దగ్గరుండి పరిశీలించారు. శని, ఆది, సోమ మూడు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి మాట్లాడుతూ తొలిరోజు ప్రశాంత వాతావరణంలో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని తెలిపారు. కళాశాలలో మూడు రోజుల పాటు మొదటి దశ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 వరకు ధ్రువపత్రాల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకున్న విధంగా సమయానికి సరైన ధ్రువపత్రాలతో హాజరై వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. తొలిరోజు 305 మంది అభ్యర్థులు స్లాట్ చేసుకోగా 283 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సంజయ్‌సింగ్, సంతోష్, ఎజాజ్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్ షెడ్యూల్

సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు జులై 8 నుంచి 15 వరకు వారికి నచ్చిన కళాశాలలు, కోర్సులను ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. వారికి జులై 19న తొలివిడత సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. ఇక జులై 26 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. జులై 27 సర్టిఫికెట్ వెరిఫికేషన్, జులై 27 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇవ్వనున్నారు. జులై 31న రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి చేస్తారు. ఆగస్టు 8 నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించి ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చి ఆగస్టు 13న ఆఖరి ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. కన్వీనర్ కోటా ఇంటర్నల్ స్లైడింగ్‌కు ఆగస్టు 21, 22 తేదీల్లో అవకాశం కల్పించి ఆగస్టు 26న సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న కొలాం విద్యార్థుల ఆధార్ కార్డులు అప్డేట్ చేస్తూ ఫోన్ నెంబర్లు అనుసంధానం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఆధార్ లేని కొలాం విద్యార్థులకు ఆధార్ కార్డులు మంజూరు చేయడం కొరకు శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వందన్ వికాస్ కేంద్రాల ద్వారా ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని, ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుదీకరణ, మూత్రశాలలు, అదనపు తరగతి గదుల పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.

ప్రారంభమైన అకాడి సంబరాలు



కాసిపేట : మండలంలోని కుర్రేఘడ్ గిరిజన గ్రామంలో అడవి తల్లికి తొలి పూజ నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడటంలో భాగంగా మొదటి పండుగ అకాడి సంబరాలు శనివారం ప్రారంభించారు. అడవిలో వనభోజనాలు, ఎత్మసార్ పూజలు నాలుగు నెలల పాటు కొనసాగుతాయని ఆదివాసులు తెలిపారు. అమావాస్యలో తొలి పండుగ పురస్కరించుకొని ఆచారం ప్రకారం వనంలో పూజలు నిర్వహించి పొలిమేరలోకి వెళ్లి చెట్టు కింద ఉన్న రాజుల్ పేన్ దేవుడికి ప్రత్యేక పూజ చేస్తారు. కోడి పంచాంగం చూడటం, పాడి పంటలు, పశువులు బాగుండాలని లక్ష్మణ రేఖ లాంటి గీత గీసి తుర్రను ఉదుతూ పశువులను గీత దాటించడం లాంటివి చేస్తారు. అనంతరం నాగుల పంచమి, జమురావుష్, శివబోడి పొలాల, దసరా, దీపావళి నెలల పాటు ఎత్మసార్ దేవుని ఉత్సవాలు ఘనంగా చేస్తారు. ఎత్మసార్ దండారి దేవునికి ప్రభుత్వం ప్రతి ఏటా ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆదివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గ్రామ పెద్దలు వల్క శ్రీను, కుర్సింగ భూదేశవ్, పెందూర్ ప్రభాకర్, కుర్సింగ మదపురావ్, వల్క రాము, లచ్చు పాల్గొన్నారు.



సర్పంచ్, ఎంపీటీసీలకు సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్

సర్పంచ్, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండల కేంద్ర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, ఎంపీటీసీ పద్మ వీరయ్యను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, ఉపాధ్యాయులు రాజేందర్, రజనీదేవి, రమేష్‌చందర్‌గౌడ్, రమాదేవి, రాధిక, సారిక రామారావు, కవిత, హన్మంతు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని మాన్యాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజుల గూడ గ్రామంలో డాక్టర్ రాంబాబు, వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేశారు. జ్వరం, జలుబు ఉన్న వారికి వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వర్షకాలం నేపథ్యంలో ప్రతి గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. గర్భిణీ, బాలింతలకు టీకాలు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది గోకుల్, శిలా, జంగుబాయి, ఆడే నిర్మల ఆశాలు ఉన్నారు.

టూటౌన్ సీఐగా సీహెచ్.కరుణాకర్‌రావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా సీహెచ్ కరుణాకర్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సీఐ గా పని చేసిన ఎం.అశోక్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఇంటలిజెన్స్‌లో పనిచేస్తున్న సీహెచ్ కరుణాకర్‌రావును టూటౌన్ సీఐగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన నూతన టూటౌన్ సీఐ కరుణాకర్‌రావును సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-కుభీర్

సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎం రమేష్ అన్నారు. శనివారం మండలంలోని పార్డి(బి) గ్రామపంచాయతీ భవనంలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఉన్న మహిళ సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళ సంఘ సభ్యులకు రుణాలు అందించి, వారికి ఆర్థిక తోడ్పాటును అందిస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం వారికి లక్షల రుణాలు మంజూరు చేసి, వారి అండగా ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా రుణాలు పొందిన మహిళలు అవసరమైన రంగాల్లో పెట్టుబడులు పెట్టి ఎంతో లాభాలు పొందడం జరుగుతుందని అన్నారు. రుణాలు పొందిన మహిళలు క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తే మరింత ఎక్కువ రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం మహిళ సంఘాల లావాదేవీలను సభ్యుల ముందు చదివి వినిపించారు. అనంతరం పార్డి(బి) గ్రామంలో ఉన్న మహిళ సంఘాల ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘం అధ్యక్షురాలును ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మడి రాజకళ, కార్యదర్శిగా రేఖ, కోశాధికారిగా రత్నమాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ దత్త్రాతి, సీఏ సాయినాథ్, మహిళ సంఘాల సభ్యులు ఉన్నారు.

కష్టపడి మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలి

నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలో శనివారం సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లా స్థాయి అధికారులతో, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన విద్య, ఆరోగ్య, వ్యవసాయం, అంగన్‌వాడీ, ఐకేపీ వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. గ్రామస్తులు మండలంలో ఉన్న సమస్యలు అంబులెన్సు, సబ్ సెంటర్, పసుపుల బ్రిడ్జి, కూలిపోవడంతో అరవై కిలోమీటర్లు దూరబారం అవుతుందని వెంకం పోచంపాడ్ రోడ్డు గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ ప్రత్యేకాధికారి అధికారి సుబేధ కపూర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ దన్‌రాజ్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఎంపీడీఓ రమాకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీఓ రత్నాకర్‌రావ్, హెచ్ఎం రామ్‌చందర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయించిన యువకులు

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని ధాబా(బి) గ్రామపంచాయతీ పరిధిలోని పౌనూర్ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. కాగా శనివారం గ్రామ పటేల్ సోనేరావ్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు విద్యుత్ సిబ్బందికి విద్యుత్ స్తంభాల మరమ్మత్తు పనులు చేయుటకు సాయం చేశారు. భారీ వర్షాలు రావడంతో గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు వంగిపోవడంతో ముందు జాగ్రతగా పనులు చేయించామన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వాతావరణ సమతూల్యం కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు అమ్మ పేరుతో మొక్కను నాటాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అమ్మ పేరుపై మొక్కతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ చెట్లు లేని కారణంగా వాతావరణం సమూతుల్యం దెబ్బతింటోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం, పీఎం మోడీ అమ్మపేరు మొక్క నాటాలని, రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరిట మొక్కలను పెంచేలా నిర్ణయించాయన్నారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. సంవత్సరంలో నాలుగు మొక్కలు నాటేలా మానసిక ఆలోచనను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలన్నారు. వర్ష కాలంలో మొక్కలు నాటడానికి అనువైన కాలమని, బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. శ్రీనివాస్, పీడీ అనిత, బీజేపీ నాయకులు లాలామున్న, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రత పాటించాలని పల్లె దవాఖాన వైద్యులు ప్రశాంత్ అన్నారు. శనివారం మండలంలోని దాబా(కె) గ్రామంలో సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తలమద్రి సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులను మొదట్లోనే అరికట్టాలంటే దోమల నివారణ అత్యంత ప్రదానం అన్నారు. దోమలు అనేక రకాల వ్యాధులకు కారణమవుతున్నారు. వీటి వల్ల ప్రధానంగా మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యాధులన్నీ దాదాపుగా ఒకేరకంగా ఒకే లక్షణాలతో ఉంటాయని తెలిపారు. వ్యాధులకు కారణమైన వైరస్ వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు మురుగు తొలిగించాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద నీటి కుండిలలో, కొబ్బరి చిప్పలో, కూలర్‌లలో టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి, ముండ్ల పొదలు ఇంటి పరిసరాలల్లో ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుభాష్, వైద్య సిబ్బంది ఏఎన్ఎం లు పార్వతి, సంగీత, ఆశకార్యకర్త శిలాబాయి పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపూరావ్ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని గుస్సాడిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ డీఎస్సీని వేసి, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈనెల 20న ఉద్యమ నాయకుడు తుడుం దెబ్బ వ్యవస్థాపక సభ్యులు సీడం సంభు వర్ధంతిని విజయవంతం చేయాలని అన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీఓఎంఎస్ 3ను చట్టం చేయాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఐటీడీఏ ద్వారా అంబులెన్స్‌ను కేటాయించి, అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పీహెచ్సీలలో డాక్టర్లను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసి మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల అశోక్, జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు కనక ప్రభాకర్, డివిజన్ ఉపాధ్యక్షులు సోయం భీంరావు, నార్నూర్ మండల అధ్యక్షులు ఆడ శ్రీరామ్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు. జుగ్నాక్ భారత్, ఆదిలాబాద్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనక గంగారాం, కాత్లే పృథ్వీరాజ్, ఆదివాసీ విద్యార్థి ఇంద్రవెల్లి మండల ప్రధాన కార్యదర్శి మాడవి జంగు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, జులై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1లక్ష చెల్లించాలని వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసువచ్చామని అన్నారు. పై అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను జులై 4 తర్వాత ఇంటికి పంపించాలనే నిర్ణయం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే, ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, నాయకులు డి.సునీత, పి.రత్నమాల, జె.సుభద్ర, విజయ, పద్మ, పంచశీల, అనసూయ, లక్ష్మి, అనిత, కమల, పార్వతి, సీఐటీయూ నాయకులు దర్శనాల నగేష్ అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దహనం

- బొగ్గు గనుల వేలం ఆపాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడంలో భాగంగా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఎదుట ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడంలో భాగమే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు కేంద్రం నిర్ణయించిందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రా ఆదాయానికి గండి పడుతున్న పట్టించుకోకుండా వేలంపాటను సమర్ధించడం సిగ్గు చేటన్నారు. నిజాం కాలంలో కూడా వీటిని ఎవరికి ఇవ్వలేదని, తెలంగాణ సంపదగా అప్పటి రాజు ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17వ తేది వరకు వివిధ రకాలుగా నిరసన తెలుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ల నాయకులు అన్నమొల్ల కిరణ్, సిర్రదేవేందర్, జగన్ సింగ్, గణేష్, వెంకట నారాయణ ఉన్నారు.

కేసుల పరిష్కారానికి నూతన కోర్టులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్
- జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

కేసులను త్వరతగతిన పరిష్కరించుకునేలా నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రధాన కోర్టు ఆవరణలో రెండవ అదనపు జూనియర్, సివిల్ జడ్జీ కమ్ రెండవ అదనపు జూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జిల్లా కేంద్రానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా కోర్టుల జడ్జీలు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. అదే విధంగా జిల్లాకు వచ్చిన జడ్జీని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. బార్ కార్యాలయంలో ఆదివాసీ సంస్కృతి ప్రకారం గుస్సాడి టోపితో పాటు పగిడి ధరించారు. జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం హైకోర్టు జడ్జీ జస్టిస్ శరత్ మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి నూతన కోర్టులను



ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వెనకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్‌లో ఈ నూతన కోర్టుతో మరిన్నీ కేసులు పరిష్కరమయ్యే అవకాశాలున్నాయన్నారు. ఏజెన్సీ జిల్లాల్లో పాత కాలం చట్టాలే ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు మార్పు జరగలదేన్నారు. వాటిని తెలుసుకోవడంతో పాటు న్యాయవాదులు వారి హక్కులను కూడా గుర్తించాలని సూచించారు. వారి పరిధిలో ఉన్న వాటిని వినియోగించుకుంటూ ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల సమస్యలున్నాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, సూర్యవార్ మంజుల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.



పశుసంవర్ధక శాఖలో జూనోసిస్ డే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మనిషి జంతువులతో సహజీవనం మొదలు పెట్టినప్పటి నుంచి వాటి ద్వారా సంక్రమించే వాధ్యులకు గురవుతున్నారని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికిషన్ అన్నారు. శనివారం వెటర్నరీ ఆస్పత్రిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా శునకాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా గోపికిషన్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా విశ్వాసం కలిగిన శునకాల నుంచి అధికంగా వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రతి ఏటా జూనోసిస్ డేను నిర్వహిస్తు టీకాలు వేస్తు వ్యాధుల నుంచి రక్షించేలా పశుసంవర్ధక శాఖ కృషి చేస్తుందన్నారు. కుక్కల నుంచి బ్యాక్టీరియా, వైరస్ వల్ల టీబీ, బ్రుసిలూసిస్, రెబిస్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. వీటిని నిరోధించడానికి ముందస్తుగానే శునకాలకు టీకా కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ గజానన్, డాక్టర్ సతీష్, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని రాజుర ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు సురేష్ రావ్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీ అయిన కుంట రాజేశ్వర్‌ను, అదేవిధంగా జెడ్పీహెచ్ఎస్ పదోన్నతితో వచ్చిన మురళీ మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్, గంగాధర్, శంకర్‌సింగ్ ఉపాధ్యాయులను పాఠశాల ఆవరణంలో శనివారం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఎందరో పేద విద్యార్థులకు చేయూతనందించి పాఠశాల అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు అర్చన, శ్రీధర్ రెడ్డి, విజయ్ కుమార్, వీడీసీ ఛైర్మెన్ దాసరి ప్రవీణ్, వైస్‌ఛైర్మెన్ నందగిరి బాలరాజుగౌడ్, తాజా మాజీ సర్పంచ్ సుందరగిరి ముత్తాగౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ ఓరికే నర్సవ్వ పోతన్న వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జాదవ్ గోపాల్

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రానికి చెందిన చిప్పరి రాజేశ్వర్ శనివారం తన తండ్రి వైద్యం నిమిత్తం రిమ్స్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా రిమ్స్‌లో తన పర్సును పోగొట్టుకున్నారు. ఆ పర్సులో రూ.5వేల నగదు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఇలా కొన్ని ఐడి కార్డులు ఉన్నాయి. పోగొట్టుకున్న పర్సు టైగర్ గ్రూప్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ గోపాల్ కుమార్‌కు దొరకడంతో వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడు. దీంతో చిప్పరి రాజేశ్వర్ తనదేనని వివరాలు తెలుపగా జాదవ్ గోపాల్ పర్సు అందజేశాడు. అందుకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

రేపు సైన్స్ కళాశాలలో డెమో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఇచ్చోడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. కాగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సైన్స్ కళాశాలలో 3న డెమో ఉండగా వాయిదా పడింది. తిరిగి ఆ డేమోను 8న సోమవారం ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నట్టు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆర్ట్స్ కామర్స్ కళాశాలలో పోస్టులకై డేమో కోసం ఇంకా తేదీ ఖరారు కాలేదని తెలిపారు.

తైబజార్ వేలంపాటకు రూ.5.50 లక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంత, తైబజార్ వేలం పాటను శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వేలంపాటలో మొత్తం 12 మంది రూ.50 వేలు డిపాజిట్ చేసి పాల్గొనగా, మండల కేంద్రానికి చెందిన ఆడే రాం, నివాస్, రూ.5లక్షల 50 వేలకు కైవసం చేసుకున్నారు. వేలం పాటలో ఎంపీడీఓ జవహర్ లాల్, ఎంపీఓ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి అనురాగ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

జెడ్పీటీసీగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామస్తులు యూపీఎస్ పాఠశాల సిబ్బంది శనివారం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అదే పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు వారికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ప్రభాకర్, మాజీ సర్పంచ్ పి.పోతారెడ్డి, ప్రధానోపాధ్యాయులు భారత్, గ్రామస్తులు గోక ప్రకాష్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రసాద్, గంగాధర్, ప్రవీణ్ రెడ్డి, నర్సింగ్, పంచాయతీ కార్యదర్శి అభయ్, గంగన్న, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌక్‌లో ఎస్సీ అభివృద్ధి అదికారి సునీత, దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ తరువాత ఆయన స్థానంలో జగ్జీవన్‌రామ్ దళితుల కోసం ఏనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. దళితులకు రావాల్సిన హక్కులు ప్రభుత్వాలు సక్రమంగా అందించాలన్నారు. దళితులకు రావాల్సిన హక్కులు ఇంక పూర్తి స్థాయిలో రావడం లేదన్నారు. ప్రభుత్వాలు మహానీయుల జయంతి, వర్ధంతులను నిర్వహించడంతో పాటు వారి ఆశయ సాధనలు, ఆలోచనలను ఆచరణలో పెట్టాలని కోరారు. కార్యక్రమలో మహాత్మ జ్యోతిభా పూలే గురుకులాల ఆర్సీఓ గోపిచంద్, దళిత సంఘాల నాయకులు నక్కరాందాస్, రాజన్న, మల్యాల స్వామి, నాగన్న పాల్గొన్నారు.

మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మాదిగ సంక్షేమ సంఘం, బాబు జగ్జీవన్ రామ్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని బాబు జగ్జీవన్‌రామ్ చౌక్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందాల రాజన్న, బాబు జగ్జీవన్ రామ్, అభ్యుదయ సంఘం అధ్యక్షులు మల్లెల స్వామి, నక్క రాందాస్, నాగన్న, నగేష్, ప్రసన్న కుమార్, దర్శనాల అశోక్, బండారి అశోక్, గంగాధర్, సతీష్, రవికుమార్, శివకుమార్, ఇస్తారి, విలాస్ ఉన్నారు.

ఇచ్చోడ : దేశ మాజీ ఉపప్రధాని, బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పులా మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమంలో, దేశ పునర్నిర్మాణంలో, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను రిజర్వేషన్లను కాపాడే విషయంలో మహనీయుడైన బాబు జగ్జీవన్ రామ్ పాత్ర కీలకమైందని అన్నారు. అతి పిన్న వయసులో చట్టసభల్లో అడుగుపెట్టి, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు వివిధ మంత్రిత్వ శాఖలకు బాధ్యత వహించి దేశం సవాళ్ల ఎదుర్కొంటున్నప్పుడు అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నిలదొక్కుకునే విధంగా దేశానికి సేవలందించి, అందరి మన్ననలు పొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు, లక్ష్యాలకు అనుగుణంగా సాంఘిక అసమానతలు వివక్షతలు లేని సమాజం కోసం అందరికీ సమన్యాయం రాజ్యాంగం కల్పించిన హక్కులు రిజర్వేషన్ ఫలాలు అందే విధంగా పాటుపడాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వాలపైన ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జన్నారపు సాయి పాల్గొన్నారు.

నవతెలంగాణ
3
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జులై 07, 2024 | www.navatelangana.com

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల జారీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 24 మంది ట్రాన్స్ జెండర్‌ల దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారి పి. రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన ఇన్‌చార్జి జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీ వద్ద నిర్వహిస్తున్న వైద్య శిభిరాన్ని ఇన్‌చార్జీ జీఎం మచ్చగిరి నరేందర్ శనివారం సందర్శించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం మెడికల్ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా జీఎం అన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్య రిపోర్టు సంస్థ వద్ద ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్క ఉద్యోగి వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ పీఓ ఎస్.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, గోలేటి డిస్పెన్సరీ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌లతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమైక్య సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రతి పాఠశాలకు విద్యుదీకరణ పనులు 100 శాతం చేయాలని, తాగునీటి కొరకు ట్యాంకులు ఏర్పాటు చేయాలని, నీటి వసతి లేని చోట నూతన బోర్లు వేసి వాటికి మోటార్లు బిగించి సురక్షితమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల కోసం ప్రత్యేక మూత్రశాల నిర్మాణం చేయాలని, పాఠశాల భవనాల గోడలు, ఫ్లోరింగ్, స్లాబ్ మరమ్మత్తు పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇంకా మొదలుకాని పనులు, సగం, మూడో వంతు పూర్తి అయిన పనుల వివరాలతో నివేదిక అందించి, త్వరగా పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగోన్నతి, బదిలీల్లో భాగంగా పాఠశాల నుండి వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి సేవలను కొనియాడారు. హెచ్ఎం విజయనిర్మల మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నస్థాయికి ఎదిగేల బోధనలు చేయాలని సూచించారు. అనంతరం బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సత్కరించి స్వాగతించారు. ఇందులో బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన పొందిన ఉపాధ్యాయులు సుజాత, నగేష్, శ్రీధర్, రమాదేవి, కళావతి, విజయ్, పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, లక్ష్మీ, భారతి, ఆత్మరామ్, సంతోష్, సాధియా పాల్గొన్నారు.

త్వరలో హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళా

నవతెలంగాణ-రెబ్బెన

కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్‌డీఎఫ్ బ్యాంక్ అందించే ప్రయోజనాలను వివరించేందుకు త్వరలో బెల్లంపల్లి ఏరియాలో బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్ మేళాను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ జీఎం మచ్చగిరి నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఇటీవలే బ్యాంక్‌తో సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షల వరకు భీమా సౌకర్యం, జీరో బ్యాలెన్స్ అకౌంటు, పిల్లలు చదువుల కోసం రూ.4 లక్షలు వంటి వివిధ రకాలు ప్రయోజనాలున్నాయని తెలిపారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



జిల్లాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల(బాలుర, బాలికలు)లో అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయ ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి పోలోజు బాలరాజు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. సిర్పూర్(టి) బాలుర కళాశాల, పాఠశాలలో జేఎల్(ఇంగ్లీష్), పీజీటీ(సోషల్), సిర్పూర్(టి) బాలికలు కళాశాల, పాఠశాలలో జేఎల్(హిస్టరీ), పీజీటీ(ఇంగ్లీష్), టీజీటీ(ఇంగ్లీష్), టీజీటీ(మ్యాథ్స్), కాగజ్‌నగర్ కళాశాల, పాఠశాలలో జేఎల్(ఫిజిక్స్), బాటని, పీజీటీ(మ్యాచ్, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్), టీజీటీ(ఇంగ్లీష్), రెబ్బెన కళాశాల, పాఠశాలలో పీజీటీ (బయోసైన్స్), టీజీటీ (మ్యాథ్స్), ఆసిఫాబాద్ కళాశాల, పాఠశాలలో జేఎల్ (తెలుగు, బోటనీ), పీజీటీ(బయోసైన్స్) మొత్తం ఆసిఫాబాద్ జిల్లాలోని గురుకులాలలో 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 9న ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, జేఎల్ అభ్యర్థులకు నెలకు రూ.23,400, పీజీటీలకు రూ.18,200, టీజీటీలకు రూ.18200 వేతనం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని రాంనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవస్థానం అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠను ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని మాజీ సర్పంచ్ బండె తుకారాం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం మహాఅన్నదాన ఉంటుందన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



పూలమాల వేసి రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలలో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.త్రివేణి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, జులై 1 నుండి ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.1 లక్ష చెల్లించాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 రోజులు చేసిన సమ్మెతో పాటు ఇతర అంశాలను ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి గతంలో తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం వాటిని కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 10ను రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు నాయకులు రజిత, ఇందిరా, వినోదిని, రాజమ్మ వనితా, సుశీల కౌసల్య, కమలమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

నవతెలంగాణ-రెబ్బెన



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రయివేట్ వారికి ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దీనిన మనుకొని బొగ్గు బ్లాకులను సింగరేణికె కేటాయించాలని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇన్‌చార్జీ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జీఎం నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రసిడెంట్ పతెం రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రయివేట్ వారికి ఇచ్చేల వేలం నిర్వహిస్తుందన్నారు. ప్రయివేట్ వారికి ఇస్తే సింగరేణి మనుగడ ఉండదన్నారు. వేలం పాటలో పాల్గొంటే సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ ఏవిధంగా అవుతుందని ప్రశ్నించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను వేలంపాటలో పెట్టకుండా గతంలో ఇచ్చినా విధంగా సింగరేణికె ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా బ్రాచ్ సెక్రటరీ ఎం.శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండి గౌస్, సెంట్రల్ నాయకులు కొండ్ర శంకర్, ఏరియా నాయకులు ఎస్‌కే ఇనూస్, హాస్పిటల్ ఇంచార్జీ ఆర్.శ్రీనివాస్, సీహెచ్‌పీ పిట్ సెక్రెటరీ ఎండీ ఆరీఫ్, ఎస్అండ్‌పీసీ అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ కిష్టస్వామి, ఫిట్ సెక్రటరీ జి.భాలేష్, దీపక్, రాజ్, శంకరమ్మ, పార్వతి, రాజేశ్వరి, నాగరాణి పాల్గొన్నారు

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో...

తెలంగాణలోని బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికి నామినేషన్ పద్ధతిపై కేటాయించాలని వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియాలో జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణికి ప్రయివేట్‌పరం చేసే యోచనను కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగిలాల్, సభ్యులు ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, అలవేణి సంపత్, నాయకులు గజిల్లి చంద్రశేఖర్, రాజేందర్, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా
- అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని తిర్యాణి(జి) ఆశ్రమ పాఠశాల, గిన్నెధరి ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుండి విద్యార్థులకు అందుతున్న వివిధ రకాల వస్తువులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధించి వారితో కలిసి భోజనం చేశారు. రిజిస్టర్లలో అవకతవకలున్న నేపథ్యంలో సిబ్బందిని మందలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో ఔషధాలు ఉంచనందున ఫార్మసిస్ట్‌కు ఆదేశాలు ఉల్లంఘించినందుకు అక్కడి ఏటీడీఓకి షోకాజు నోటీసు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడు సాగు చేస్తున్న ఎస్సీ, బీసీలకు పట్టాలివ్వాలి

- నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య

నవతెలంగాణ-బెజ్జూర్

ఆదివాసులతో పాటు ఎస్సీ, బీసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య, ఉపాధ్యక్షులు బసర్కర విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లుంబిని నగర్, మర్డిడి గ్రామాల్లో నేతకాని సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వనాథులు మాట్లాడారు. ఉత్తర తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్ నుండి భద్రాచలం వరకు నిరుపేదలు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు దాగాం నాగయ్య, పత్రు, ముంజం శంకర్, కర్మ ఎమాజీ, గోమాస చంద్రశేఖర్, బసర్కర్ అశోక్, కొండ ఆనంద్ రావు, వగాడి మారుతి, పోతుగంటి ప్రవీణ్, వేముర్ల పోషం, దుర్గం యశ్వంత్, వేముర్ల సాయిటట పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూలు



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మృతి చెందిన, మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటిలోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం ఖైరిగూడ పీఓ ఎస్.సత్యనారాయణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 మంది కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యుల ఖైరిగూడ పీఓ ఎస్.సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి వివరాలపై ఆరా తీశారు. ఉద్యోగ వివరాలపై ప్రశ్నించి, ధ్రువ పత్రాలను పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సింగరేణి కార్మికులు వారి పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. చదువు కోసం సంస్థ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖైరిగూడ ఓసీ మేనేజర్ ప్రవీణ్ వి ఫాటింగ్, డిప్యూటి పీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

10 నుండి ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రయివేట్ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 10 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ హెచ్చరించారు. బస్సు డ్రైవర్లతో కలిసి డిపో మేనేజర్ విశ్వనాథ్‌తో జరిపిన చర్చలు విఫలమైనంతరం ఆయన మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని గతంలో వినతిపత్రం ఇవ్వడంతో పాటు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళ్తామని సమ్మె నోటీసు అందజేశామన్నారు. అయిన ఆర్టీసీ యాజమాన్యం కానీ డిపో అధికారులు కానీ పట్టించుకోవడం లేదని తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్లను శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లకు రూ.32వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. 15 సంవత్సరాలుగా డిపో పరిధిలో పనిచేస్తూ జీవితాన్ని ఆర్టీసీ కోసం అంకితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం అద్దె బస్సుల యాజమాన్యాలతో శనివారం జరిగిన చర్చలు విఫలం కాగా ఈనెల 10లోపు అద్దె బస్సు డ్రైవర్ల డిమాండ్లు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్ళనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్ల డిపో అధ్యక్షుడు మధుసూదన్, ఉపాధ్యక్షుడు అయిల్లా భాస్కర్, ప్రధాన కార్యదర్శి షఫీ, జాయింట్ సెక్రటరీ తేజ, విజయ్, కోశాధికారి సాయి కృష్ణ, కార్మికులు విజయ కుమార్, తిరుపతి, హైమద్, వినోద్, ప్రకాష్, బాలకృష్ణ, గణేష్, నగేష్, శంకర్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అలవాటు చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

విద్యార్థులు తమ జీవనశైలిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దారిశెట్టి లక్ష్మీనర్సింహం సూచించారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రోజురోజుకూ అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో అమ్మ పేరుతోనైనా ఒక మొక్క నాటి సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కైరిట్ గ్రామానికి బీటీ రోడ్డు, వంతెన నిర్మించాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కైరిట్ గ్రామానికి బీటీ రోడ్డు, వంతెన నిర్మించాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం డివైఎఫ్ఐ బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామంలో బీటీ రోడ్డు, గ్రామ సమీపంలో గల ఒర్రెపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు తెలిపారన్నారు. ప్రభుత్వాలు మారిన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని, వర్షాకాలంలో గ్రామానికి వెళ్లేందుకు వంతెన లేకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారన్నారు. ప్రభుత్వం రోడ్డుకు నిధులు మంజూరు చేసి సీసీ రోడ్డు నిర్మించాలని, మురుగు కాలువలు, వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ప్రజలను కలుపుకొని ఆందోళన చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్, మండల అధ్యక్షుడు దుర్గం నిఖిల్, సభ్యులు భూమేష్, వినష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు అందజేసిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ద్వారకానగర్‌లో గల శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం రెండు కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003-04 విద్యాసంవత్సరంలో తాము ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశామని, పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పానందించాలన్న ఉద్దేశ్యంతో ఆధునిక సాంకేతికతకు అనుగూణంగా రెండు కంప్యూటర్లను అందజేసినట్టు చెప్పారు. ఇందులో పూర్వ విద్యార్థులు పర్వతి రాజశేఖర్, ప్రశాంత్, సందీప్, సతీష్, శ్రీనాథ్, లక్ష్మీప్రసన్న, స్వాతి, తిరుమల పాల్గొన్నారు.

15 నుంచి ఉచిత ఓల్వో శిక్షణ

నవతెలంగాణ-రెబ్బెన

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఉచిత ఓల్వో ట్రక్ డ్రైవర్ శిక్షణకు ఆసక్తిగల యువకులు దరఖాస్తులు చేసుకోవాలని అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి పాస్ అయి ఉండి హెవీ గూడ్స్ వేహికిల్ లైసెన్స్ కలిగి ఉండి, కనీసం మూడేండ్ల అనుభవం ఉండాలన్నారు. 18 నుండి 35 ఏండ్లు ఉన్నవారు ఈ నెల 11లోపు గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. సింగరేణి ప్రభావిత, పునరావాస గ్రామాల నిరుద్యోగ యువకులు, కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

టోల్ ప్లాజా కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరెండి టోల్ ప్లాజా వద్ద పనిచేస్తున్న కార్మికుల యూనియన్‌ను ఏర్పాటు నూతన కమిటీని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.26,000 చెల్లించాలని, రెగ్యులర్‌గా ఈఎస్ఐ, పీఎఫ్ జమ చేయాలని, జీతాల్లో తేడా లేకుండా అందరికీ ఒకే మాదిరిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంద్ర, కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా శశి కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా చరణ్ రాజ్, వికాస్, కల్పన, దత్తు, వేణుగోపాల్, జోగేరావు, దినేష్‌లను ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

నవతెలంగాణ-జన్నారం



దళిత సంఘాల నాయకులు మామిడిపల్లి ఇంద్రయ్య బోర్లకుంట ప్రభుదాస్ తాళ్లపల్లి రాజేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అతను దళిత జాతికి పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు కార్యక్రమంలో దళిత సంఘాల జిల్లా నాయకులు దుమల రమేష్, కోల పద్మారావు ప్రవీణ్, ప్రశాంత్, కొండుకూరి రాజు, ప్రశాంత్, మండల నాయకులు మల్యాల రమేష్, వేల్పుల రాజేష్, వెంకటేష్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొండుకూరి ప్రభుదాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య


నవతెలంగాణ-తాండూర్



అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో 35 మంది టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు నిర్బంధ విద్యలా కాకుండా, ఆటాపాటలతో పాఠ్యాంశాలను బోధించాలని చెప్పారు. పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్తి చేసుకునే విధంగా టీచర్లు బోధించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు ఆదేశించారు. శనివారం కుందారం గ్రామాన్ని సంధర్శించిన ఆయన గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులు పరిశీలించారు. ఇంటింట తడిపొడి చెత్త సేకరించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వార సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్ధాలు కనపడకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కంపోస్టు తయారి విధానం, కంపోస్టు ఎరువు వినియోగంపై పలు సూచనలు చేసిన ఆయన నర్సరీ మొక్కలకు ప్రతి రోజు నీరు అందించాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ముబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా మండలంలోని ఎల్కంటి గ్రామాన్ని సంధర్శించిన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. వర్షాకాలంలో ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

నవతెలంగాణ-జన్నారం

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాలు పేద ప్రజలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్, 500కే సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెంబి శంకర్, ముత్యం సతీష్, డైరెక్టర్ రజాక్, మున్ను రాజన్న పాల్గొన్నారు.

కుంట భూములను స్వాధీనం చేసుకోవాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఉన్న అల్లం వారి కుంట కబ్జాకు గురైందని కబ్జా చేసిన వారిని శిక్షించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి మాట్లాడుతూ వెంటనే అల్లం కుంట వద్ద సర్వే నిర్వహించి కబ్జాకు గురైన భూమిని బయటకి తీయాలన్నారు. కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆ కుంట వద్దకు పంపించి సర్వే నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అల్లం పెద్దయ్య, సంధ్య వేణి పవన్, వేయిగండ్ల రవి, చారి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందనికలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని భీమారం మండలం ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన సూరం పవన్‌కుమార్ అనే దివ్యాంగుడికి జిల్లా స్త్రీ, శిశ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె. చిన్నయ్యతో కలిసి రూ.1 లక్షా 20 వేల విలువ గల బ్యాటరీ వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా బ్యాటరీ వీల్‌చైర్ పంపిణీ చేయడం జరిగిందని, జిల్లాలో మరో 8 మందికి బ్యాటరీ వీల్‌చైర్‌లు మంజూరు అయ్యాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

నవతెలంగాణ-జైపూర్

రహదారి మీదుగా వాహనాల రాకపోకలు గుర్తించడంతో పాటు అపరిచిత వ్యక్తులను గుర్తించి నేరాలు అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని జైపూర్ ఎస్ఐ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి పొడవునా ఉన్న వ్యాపారస్థులతో శనివారం సమావేశమైన ఆయన సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. వ్యక్తిగతంగా దుకాణ సమూదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు జాతీయ రహదారిపై సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్థులతో పాటు దాతలు సహకరించాలని కోరారు. జాతీయ రహదారి మీదుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిపోవు వాహణాల రాకపోకలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించవచ్చని స్థానికులకు అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలను శనివారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు, సిలబస్ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని గత సంవత్సరం సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశామన్నారు. ఈ సమ్మె సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్కు రూ.1 లక్ష పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగుల స్థితిగతులు, గత 24 రోజులు సమ్మె జరిగిన పరిస్థితి, ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, హామీల్లో ఒక్కటైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి కూడా వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి, ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చామన్నారు. కానీ వాటిని పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయమని, పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్సు జూలై 1 నుండి ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమని వాపోయారు. అంగన్వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం సరైంది కాదని, గత కొన్ని సంవత్సరాలుగా ఐసిడిఎస్ వ్యవస్థను కాపాడే అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చేటువంటి గుర్తింపు ఇదేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విరోనిక, అనురాధ, రాజేశ్వరి, సరిత, శారదా, ప్రవీణ, పద్మావతి, రాణి, ఇందిరా, శిరీష పాల్గొన్నారు.

గుడిసెవాసుల సమస్య పరిష్కరించాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారులో గల ప్రభుత్వ భూమి సర్వే నెం.8లో గల 27 ఎకరాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదల సమస్య పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యుడు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. ఈ మేరకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారు 2023 ఏప్రిల్ 30 నుండి ఎనిమిది వందల మంది గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. ఈ విషయమై గత ప్రభుత్వం 30 మందిపై అక్రమ కేసులు, ఒక బైండోవర్ కేసులు పెట్టిన తీరును వివరించారు. ప్రభుత్వ భూమిని కబ్జాలు చేసుకొని అక్రమంగా పట్టాలు పొందిన వారికి అండగా నిలిచిన గత ప్రభుత్వం నిరుపేదలైన వారు గుడిసెలు వేసుకున్న వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. ఎంత నిర్బంధం పెట్టినా అదరక బెదరక ఎండ, వానలు లెక్క చేయకుండా కారు చీకట్ల మధ్య కాలం వెల్లదీస్తున్నారని వివరించారు. ఇది జీర్ణించుకోలని భూకబ్జాదారులు 600 మంది కిరాయి మనుషులతో వచ్చి పేదల గుడిసెలు కూల్చి పెట్రోల్ పోసీ కాల్చడమే కాకుండా మహిళలను సేతం చూడకుండా దాడులు చేసి తీరు బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజేశ్వరి, గొమాస ప్రకాష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సిడం సమ్మక్క, భూపోరాట కన్వీనర్ ఉమారాణి, ఐద్వా నాయకురాలు బండారి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యులు తుమ్మ రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం చెన్నూర్ ఏరియా కార్యదర్శి రాతిపల్లి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, కేవీపీఎస్ చెన్నూర్ పట్టణ నాయకులు కామెర మధు నాయకులు రమాదేవి, భూదేవి, సంధ్య, యామిని, లస్మయ్య, సరిత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నస్పూర్ : పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేస్తూ, వారిపై దాడి చేసిన కబ్జాదారులకు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పైళ్ళ ఆశయ్య అన్నారు. శనివారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

మాతా శిశు కేంద్రానికి మంచి రోజులు

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని మాత శిశు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సందర్శించి మాత శిశు కేంద్రానికి మంచిరోజులు రాబోతున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం మాత శిశు కేద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి గర్భిణీ స్త్రీలు ఇబ్బంది ఎదుర్కొన్నారన్న వార్త చూసి వివరాలు తెలుసుకునేందుకు వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాంకేతిక కారణల వల్ల విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడిందని వెంటనే దాన్ని మరమ్మతులు చేసి తిరిగి విద్యుత్ సమస్య తలెత్తకుండ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్న సాంకేతిక పరిణామాల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తిరిగి అలాంటి సందర్భాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. హాస్పిటల్‌లో జరుగుతున్న ప్రసవాలపై గైనకాలజిస్ట్‌లతో చర్చించారు. ఆస్పత్రిలో గర్భిణీ వార్డ్, ఐసీయూ, డాక్టర్లు, ల్యాబ్ గదులను పరిశీలించారు. అవసరమైన వార్డుల్లో మరి కొన్ని ఫ్యాన్‌లు, ఏసీలు ఏర్పాటు చేయలని తెలిపారు. డెలివరీ అయి చికిత్స పొందుతున్న గర్భిణులతో మాట్లాడి వైద్య సేవలు, వారి భాగోగులు అడిగి తెలుసుకున్నారు. మాత శిశు కేంద్రానికి వచ్చే గర్భిణులు వారి వెంట వచ్చే కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కలిపించాలని అధికారులకు ఆదేశించారు. అర్ధరాత్రి వేలల్లో గర్భిణులను మాత శిశు కేంద్రానికి తీసుకోచ్చే ఆశ వర్కర్ల కోసం ప్రత్యేక మైన గదుల కేటాయించాలని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించి వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా చూసుకోవలన్నారు. మరి కొన్ని రోజుల్లో మాత శిశు ఆరోగ్య కేంద్రానికి మంచి రోజులు వస్తాయని , పూర్తి గ ఇక్కడి నుండి తరలించి మంచిర్యాలలో గల ఐబి చౌరస్తా లో నూతనంగా నిర్మాణం అయ్యే 650 పడకలతో కూడిన ప్రధాన ఆస్పత్రిలోకి తరలిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్య ఏర్పడినపుడు అందుబాటులో లేని విద్యుత్ ఎలక్ట్రిషన్, టెక్నిషన్‌లను మార్చి వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని అధికారులను కోరారు. పర్యవేక్షకులు భీష్మ, శ్రీమన్నారాయణ, డాక్టర్ అలివేణి, మున్సిపల్ చైర్మెన్ ఉప్పలయ్య, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతో చెలరేగిపోతున్నారు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అండతో అతని బంధువులు, అనుచరులు రెచ్చి పోతున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆరోపించారు. శనివారం మంచిర్యాల పట్టణంలో గల తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీ ఇజం, గుండా ఇజం చేస్తూ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచి పేరున్న జిల్లాకు చెడ్డ పేరు తీసుకొచ్చే పనులు అతని అనుచరులు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధం గ మంచిర్యాలలో అక్రమ కేసులు బనాయింపు, భూ కబ్జాలు, గ్యాంగ్ వార్‌లు ఎక్కువయ్యాయని, ఎమ్మెల్యే అండతో కొందరు రూ.కోట్ల సంపాదించాలని చూస్తున్నారని అందులో భాగంగానే అడ్డు వచ్చిన వారిపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు నమోదు చేసి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌పై జరిగిన దాడిలో నిందితులపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేస్తే స్థానిక ఎమ్మెల్యే చొరవతో కేసును మార్చి, నిందితులు బయటకు వచ్చే విధంగా సెక్షన్‌లు మార్చి కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఇవన్నీ పోలీసులు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, ప్రజల రక్షణ కొరకు పని చేయాల్సిన పోలీసులు ఎమ్మెల్యే చెప్పినట్లు చేస్తూ సాధారణ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. పోలీసుల తీరుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నియోజక వర్గంలో జరిగే అన్యాయాలపై నిలదీస్తామని ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అంకం నరేష్, పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, విజిత్ రావు పాల్గొన్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలని సంతకాల సేకరణ

జన్నారం : మండలంలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని, సామాజిక ఉద్యమకారుడు భూమాచారి, మనీష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ జోన్‌లోకి భారీ వాహనాల రాకపోకలు నిషేధించడంతో ఇక్కడి ప్రాంతమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. టైగర్‌జోన్‌లో భారీ వాహనాల నిషేధాన్ని ఎత్తివేసి వ్యాపారస్తులను ఇక్కడి ప్రజలను ఆదుకోవాలని అన్నారు. ఆంక్షలు ఎత్తివేయాలని ప్రతిరోజు మండలంలోని ఒక్కొక్క గ్రామానికి వెళ్లి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేస్తూ పాదయాత్ర చేస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆంక్షలు ఎత్తివేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో బోర్లకుంట ప్రభుదాస్ తాళ్లపల్లి రాజేశ్వర్ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, అక్బర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడుదొంగలు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు తోడుదొంగలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. సింగరేణి సంస్థ గత 135 సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, దేశ అవసరాలకు అనుగుణంగా, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బొగ్గు వెలికితీస్తు లాభాల బాటలో పయనిస్తుందన్నారు. సింగరేణి డబ్బుతో కొత్త బ్లాక్ లను కనుగొని అనుమతుల కోసం కేంద్రానికి నివేదికను పంపిస్తే, ఆ బ్లాక్లను వేలం వేయడం అమానుషమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర సంయుక్త కార్యదర్శి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పోగాకు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అన్వేష్ రెడ్డి, కౌన్సిలర్లు ఈసంపల్లి ప్రభాకర్, వంగ తిరుపతి, నస్పూర్ మండల కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, రాజేంద్రపాణి, రఫిక్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ప్రజలు కాలనీల్లో, ఇంట్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు. శనివారం స్థానిక ప్రజలకు, యువతకు సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అందరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు దోహదపడతాయన్నారు. ఏదైనా నేర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి ఉపయోగపడుతుంది అన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలం ఆరంభంతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ముస్తాఫా సూచించారు. శనివారం గంగిపల్లి పల్లె దవాఖాన(ఆయుస్మాన్ ఆరోగ్య మందిరం)లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 52 మందిని వైద్య పరీక్షలు బీపీ, షుగర్ ఉన్న వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. నీరసంగా ఉండి జ్వరం వస్తుందన్న లక్షణాలు గల 8 మంది నుండి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్త పడాలన్నారు. డయేరియా ప్రభల కుండా ఐదు సంవత్సరాల లోపు పిల్లను జాగ్రత్తలు తీసుకోవాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రధానంగా ఎప్పటికప్పుడు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, ఈగలు దోమలు వాలిన ఆహారపదార్థాలతో పాటు నిల్వ చేసిన ఆహార పదార్థాలు వీలైనంత వరకు తినకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ వైద్యురాలు వేదాద్రీ, ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



ప్లాస్టిక్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు పలు దుకాణాలలో తనిఖీలు చేపట్టి జరిమానా విధించారు. మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ నస్పూర్ పట్టణ ప్రజలు, వివిధ వ్యాపార యజమానులు 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందము గల ప్లాస్టిక్ సంచులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎవరు వాడకూడదని, వాడినట్లైతే వారి పై చట్ట ప్రకారం చర్య తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ దండు తిరుపతి, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, భానుచందర్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-జన్నారం

జన్నారంలోని పొన్కల్ పీఏసీఎస్‌లో బాదంపెల్లి గ్రామానికి చెందిన వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రవిపై కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. రవి గత యాసంగిలో కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అకౌంట్లో వేయాల్సిన డబ్బులు వేరే వారి అకౌంట్లో వేసి రైతులను మోసం చేసినట్లు పొన్కల్(పాక్స్) పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జులై 07, 2024 | www.navatelangana.com

అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో పులి కదలికలు

- రాకపోకల నిలిపివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని అంకుసాపూర్, గోంది అటవీ ప్రాంతాల్లో శనివారం పులి కదలికలను కనుగొన్నట్టు కాగజ్‌నగర్ ఎఫ్ఆర్‌ఓ రమాదేవి తెలిపారు. వర్షాకాల కావడంతో బురదమయంగా ఉన్న నేలపై పులి సంచరించిన ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించిన సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో సీఆర్ నగర్-కమాన ప్రధాన రహదారిలో రాకపోకలను నిలిపివేసినట్టు తెలిపారు. మండలంలోని అంకుసాపూర్, నందిగూడ, నార్లాపూర్, గోంది, దరిగాం, ఉట్పల్లి, కోసిని, రేగులగూడ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా పులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పశువుల కాపర్లు ఈ గ్రామాల్లోకి వెళ్లొద్దన్నారు. పులి కదలికలు, పశువులపై దాడి చేసినట్లు సమాచారం ఉంటే అటవీ శాఖ అందించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

నవతెలంగాణ-నేరడిగొండ



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డాక్టర్ సద్దాం, ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు అందుబాటులో ఉంటారని, గ్రామంలో సీజనల్ వ్యాధులు ఎమైన ప్రబలుతున్నట్టు గుర్తిస్తే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ లక్ష్మణ్, హరికుమార్‌గౌడ్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా, తంబాకు ప్యాకెట్ల పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిషేధిత గుట్కా తంబాకుకు సంబంధించిన ప్యాకెట్లను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం నిషేధిత తంబాకు గుట్కా రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద ఉట్నూరు వైపు నుండి కాగజ్‌నగర్ వెళ్తున్న ఓమ్ని వ్యాన్‌ని తనిఖీ చేయగా 1000 అంబర్, 100 అనార్ ప్యాకెట్లు లభ్యం అయ్యాయి. దీని విలువ రూ. 3,56,000 విలువగల ఉంటుందన్నారు. నిందితులు ఉట్నూర్‌కు చెందిన షేక్ ఆసిఫ్, షేక్ ఇర్షాద్, అబ్దుల్ అర్బజ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా గుట్కా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ గుట్కా తరలించగా పట్టుకున్న సిబ్బందిని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భోజగౌడ్, హెడ్ కానిస్టేబుల్ దత్తు, కానిస్టేబుల్ శేషారావు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కెరమెరి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మండలంలోని పెద్ద కరంజి వాడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండలం దుబ్బగుడా గ్రామానికి చెందిన కొడప మారుతి(32) మండలంలోని పెద్ద కరంజి వాడ గ్రామానికి చెందిన రాథోడ్ టీకారం వద్ద సంవత్సరకాలం నుండి పాలేరుగా పని చేస్తున్నాడు. భార్య మీరాబాయికి మారుతి మధ్య రెండు నెలల క్రితం మనస్పర్థలు ఏర్పడడంతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మారుతి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో పత్తి పంటకు వేసే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మీరాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ జనసంఘ స్థాపించడంతో పాటు బీజేపీకి అతి తక్కువ మెజారిటీ ఉన్నప్పుడే ప్రజల కోసం పనిచేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన గొప్ప వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సేర్ల మురళీధర్, జిల్లా ఉపాధ్యక్షులు విశాల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, సీనియర్ నాయకులు సప్త శ్రీనివాస్, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో జిల్లా 77ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అవసరాలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర కమిటీ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యా బోధన, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. 1వ తరగతిలో 15 సీట్లు, రెండవ తరగతిలో 6, 4వ తరగతిలో 2, 5వ తరగతిలో 8, 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయన్నారు.

జాతీయ అథ్లెటిక్ కోచింగ్ క్యాంప్ శిక్షకుడిగా జిల్లా వాసి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత క్రీడా ప్రాధికార సంస్థ, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా భోపాల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో జులై 6 నుండి 20 వరకు నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్ కోచింగ్ క్యాంపుకి శిక్షకుడిగా ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న ముక్కెర విద్యాసాగర్ ఎంపిక అయ్యాడని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి తెలిపారు. శిక్షణలో లెవెల్ 2 పూర్తి చేసి అథ్లెటిక్స్ క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేలా శిక్షణ ఇచ్చినందుకు ఈ అవకాశం వచ్చిందని క్రీడల అధికారి బండ మీనా రెడ్డి తెలిపారు. జాతీయ క్యాంపు శిక్షకుడిగా ఎంపికైన విద్యాసాగర్‌ని తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె సారంగపాణి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్ రెడ్డి, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, హెచ్ఎం ఎస్.కృష్ణారావు, కుమురంభీమ్, మంచిర్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోట్నాక విజయ్, సాంబమూర్తి, సట్లా శంకర్, మారయ్య, గుండం లక్ష్మణ్, హ్యాండ్ బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకుల తిరుమల్ అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాల సీజనల్ వ్యాధుల నియంత్రణ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డా. రవీంద్ర నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతిలతో కలిసి వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని, పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే 4 నాలుగు నెలల కాలం చాలా కీలకమైనవని, వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వర్షాలు, వరదలు వచ్చే సమయంలో కలుషితమైన నీటిని తాగకుండా కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగే విధంగా ప్రజలకు తెలియజేయాలని, ప్రతి శుక్రవారం గ్రామాలలో డ్రై డే నిర్వహించి నిల్వ నీటిని తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులు, చేతి పంపులు, బావులలో క్లోరినేషన్ చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, పిచికారి చేయాలని తెలిపారు. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డయేరియా, ఫైలేరియా, ఇతర విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా నివారించాలన్నారు. బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన మందులను ఆశ, ఆరోగ్య కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ సురేందర్, ఉమర్ హుస్సేన్, డిప్యూటి డీఎంహెచ్ఓ సుధాకర్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రాం వర్ధంతి

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొర్ల వెంకటేష్ మాట్లాడారు. జగ్జీవన్ రాం అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత మహనీయుడని పేర్కొన్నారు. దళిత సమాజమం ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి వినేష్ మాదిగ, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య మాదిగ, కూటికల ఆనంద్ మాదిగ, పెంటపర్తి మహేష్ మాదిగ, అశోక్ మాదిగ, రాజేందర్ పాల్గొన్నారు

కాగజ్‌నగర్ రూరల్ : భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ భారత స్వతంత్ర సమరయోధులు, భారత దేశ ఉప ప్రధాని, దళిత ఆశాకిరణం, సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్తని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కలికోట రమణయ్య, మార్త ఉపేందర్, ఎలాగౌడ్, పురుషోత్తం, సీతారాం, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కెరమెరి : జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మిషన్ శక్తితో మహిళలు, యువతులకు రక్షణ

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు, యువతులు, బాలికల రక్షణ, అభివృద్ధికి జిల్లా శిశు, మహిళ సంక్షేమ శాఖ-మహిళ సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక సంయుక్త అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ యువరాజ అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారదలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కెరీర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుండి వచ్చే సమస్యలు, బాల్య వివాహాల నియంత్రణ ఇతర మహిళ సంక్షేమ అంశాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లు 1098, 181, 100, 1930, 14446లలో సంప్రదించవచ్చని, బాల బాలికల రక్షణ, శ్రేయస్సు దిశగా ప్రజలందరూ కలిసి కృషి చేయాలన్నారు. బాలబాలికలందరికి సమాన హక్కులు ఉంటాయని, ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికల పట్ల గౌరవభావం కలిగి ఉండాలన్నారు. తప్పు చేసిన వారికి చట్టం శిక్ష విధిస్తుందని, అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, మన ఆలోచన విధానంతో సమాజానికి ఉపయోగపడేలా కృషి చేయాలని తెలిపారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువు, కెరీర్ మీద దృష్టి సారిస్తూఉన్నత స్థానాలలో నిలిచి ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, జయరాజ్, మమత, రాణి, సాగర్, సీపీ మమత, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తమను విడిచి వెళ్లొద్దంటూ విద్యార్థుల కంటతడి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మేడం మమ్మల్ని విడిచి పోవద్దు... మీరే మాకు ఎప్పుడూ పాఠాలు చెప్పాలె.. మీరు లేకపోతే మేము బడికా రాం అంటూ ఆరెగూడ ప్రాథమిక పాఠశాలు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆరెగూడ పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు మానస, స్వరూపారాణి, అనూషలను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు మానస 12 ఏళ్లుగా విద్యాబోధనలో తనదైన శైలిలో విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా ఇతర రంగాల్లోనూ రాణించేలా క్రీడాపరికరాలు అందజేసి తన ఔన్నత్యాన్ని చాటుకుందని తెలిపారు. ఇలాంటి ఉపాధ్యాయులు, మరెందరికో ఆదర్శప్రాయులని కొనియాడారు. పాఠాలు బోధించడమే కాకుండా చిత్రలేఖనంలోనూ విద్యార్థులు ప్రతిభ సాధించేలా తన పాత్రను పోషించిందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను వస్త్రాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. భాజాభజంత్రీలతో ఘన వీడ్కోలు పలకగా విద్యార్థులంతా ఉపాధ్యాయురాలు మానస చెంతన చేరి తమ పాఠశాలను, తమను వదిలి వెళ్లొదంటూ కంటతడి పెట్టారు. విద్యార్థుల ఆప్యాయతకు ఉద్వేగానికి లోనైన మానస తాను సైతం కంటతడి పెడుతూ వీడ్కోలంటూ పాఠశాలను వదిలి వెళ్లింది. ఇందులో పాఠశాల హెచ్ఎం పర్శ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని పట్టుకొని ఏడుస్తున్న విద్యార్థులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఆర్‌సీఓ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని గురుకులాల ఆర్‌సీఓ గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్ బాల్ అండర్ 13 సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల క్రీడాభివృద్ధికి ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిస్నీటి రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారినీలు ఈ నెల 12 నుంచి 14 వరకు మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్ చంద్రకళ, కోచ్‌లు రవి, వనిత, జ్యోతి, తిరుమల్, అరవింద్, రాకేష్, పిఈటీలు చిన్నక్క, లక్ష్మీ, యాదగిరి, కరుణాకర్ పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించి ఆదివాసులు అభివృద్ధి చెందాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆదివాసులు చదువుపై దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. పోలీస్ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని దానికి తమ తరపున కావాల్సిన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికీ అనేక ఆదివాసీ ప్రాంతాలు చదువుకు దూరంగా ఉన్నాయని చదువుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, కల్తీకల్లు బారిన పడకుండా ఆదివాసి ప్రజలకు రాయి సెంటర్‌తో పాటు ఇతర ప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు వాడటం వాటిని రవాణా చేయడం చట్టరీత్యా నేరమని అటువంటి వాటిని ప్రోత్సహించకూడదన్నారు. ఆదివాసుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గతంలో తిర్యాణి మండలంలోని గుండాలలో ఏడు కిలోమీటర్ల రోడ్డును, రెబ్బెన మండలంలోని మాడవాయిగూడ నుంచి జెండా కూడా వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డును నిర్మించినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తులో ఆదివాసుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సదయ్య, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, సీఐలు సతీష్, శ్రీనివాస్, అంజన్న, చిట్టిబాబు, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి గుణవంతురావ్, నర్సింగరావు, కుడిమేత యశ్వంతరావు, ఆత్రం ఆనంద్ రావు, ఆత్రం లక్ష్మణ్, సోయం బాపూరావు, మోతిరాం, పెందూరు సుధాకర్, ఆత్రం భీంరావు పాల్గొన్నారు.

యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పాయల శంకర్ సూచించారు. శనివారం ఆదిత్య ఖండేష్కర్ సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆపద సమయంలో పక్కవారికి సాయం చేసే గుణం ప్రతి ఒక్కరికి ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉన్న కూడా నిత్యం పదుల సంఖ్యలో రోగులు హైదరాబాద్, నాగ్‌పూర్, యవత్మాల్ వెళుతుంటారన్నారు. పేదలు అంబులెన్స్‌లకు వేలకు వేలు ఇవ్వలేరని గుర్తించి, ఏకేఎస్ ఫౌండేషన్ చైర్మెన్ ఆదిత్య అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, నాయకులు ఆకుల ప్రవీణ్, రాజేష్, లాలామున్న పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

నవతెలంగాణ-లోకేశ్వరం

అమ్మ పేరుతో ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ ముధోల్ జాయింట్ కన్వీనర్ పోతుగంటి సుమన్ అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్కను లక్ష్మీ నరసింహ ఆలయ ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు ఇష్టారీతిన నరకడంతో వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. అందుకే మొక్కల ప్రాధాన్యం చాటేలా వివిధ రూపాల్లో చైతన్య నినాదాలు పుట్టుకొస్తున్నాయి. సమాజంలో అందరికీ అమ్మ అంటే గౌరవమని అలాంటి అమ్మ పేరుతో నాటిన మొక్కను అంతే గౌరవంగా పెంచితే, అది వృక్షమై కొన్ని తరాలకు నీడ, గాలిని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు కైరి మహేష్‌గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కైరి శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సురేందర్, మనోజ్, ధర్మపురి నర్సారెడ్డి, సాతిరి సంతోష్, భోజన్న, సాయికుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య, కేస్ వర్కర్ నాగమని అన్నారు. శనివారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు మహిళల, బాలికల చట్టాలు గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాల గురించి వివరించారు. సఖి కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అత్యవసర సమయాలలో 181, 100, 1098, 1930 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి ఎస్ఐగా జి.ఉదయ్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతక ముందు ఇక్కడ పనిచేసిన భూమేష్ బదిలీపై రామగుండం వేకెన్సీ రిజర్వ్‌కు వెళ్లగా కమిషనరేట్‌లో వేకెన్సీ రిజర్వ్‌లో ఉన్న ఉదయ్‌కిరణ్ ఇక్కడికి వచ్చారు.

నస్పూర్ : నస్పూర్ ఎస్ఐగా సుగుణకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నస్పూర్‌లో ఎస్ఐగా పనిచేసిన రవికుమార్ రామగుండం వీఆర్‌కు బదిలీ కాగా, గోదావరిఖని వన్ టౌన్‌లో పనిచేసిన సుగుణాకర్ నస్పూర్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు.

మాజీ ఎంపీ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేష్ కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే రేఖాశ్యామ్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాథోడ్ రమేష్ చేసిన సేవలను ప్రజలు ఎప్పుడు మరువలేరని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి బాటలో నడుపించిన మంచి నాయకున్ని కోల్పోయామని అన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వనమహోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలను నాటారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి పాల్గొని చెట్లను నాటారు. చెట్లను నాటడం వల్ల కలిగే పచ్చదనం, వాతావరణ సమతుల్యత, కాలుష్య నివారణ ఇతర ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు రాజ్‌కుమార్, రాజన్న క్రాంతి కుమార్, సుజయ్, మాసయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, విజయలక్ష్మి, యశశ్రీ, సురేష్, జ్యోత్స్నరాణి, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నీల్‌కమల్, సంగీత, హేమలత, మురళీకృష్ణ, కుమారస్వామి, సంతోష్, కార్యాలయ సిబ్బంది రాజేష్, ప్రవీణ్, కిషోర్ కుమార్, శృతి, ఏజాజ్, అహల్య, నారాయణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.